విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్

విద్యార్థులు ఆశయ సాధనకు కృషి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, మే 2 : విద్యార్థులు ఉన్నత ఆశయాలు ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 2023–24 10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో 2వ ర్యాంకు సాధించిన టీఎస్‌ఆర్‌జేసీకి చెందిన చరణ్‌తేజ, రెండో సంవత్సరంలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన ఆకుల అకాశ్, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12మంది విద్యార్థులతో పాటు టెన్త్ ఫలితాల్లో జిల్లాలో 10జీపీఏ సాధించిన 11 మందికి, ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజలతో కలిసి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలో టెన్త్, ఇంటర్ ఎంతో కీలకమైందన్నారు. ఈ దశల్లోనే విద్యార్థులు ఉన్నత ఆశయాన్ని ఎంచుకొని చదువులో ముందుకు సాగాలని సూచించారు.

సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

ములుగు జిల్లాకు కొత్తగా వచ్చిన 200 బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ర్యాండమైజేషన్ ప్రకియ చేపట్టారు. ములుగు అసెంబ్లీ సెగ్మెంట్, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 23 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, మొత్తం 2 బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతాయన్నారు. 200 బ్యాలెట్ యూనిట్ల కొత్తగా వచ్చాయని, ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తి చేసి సప్లమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. పోలింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఓటింగ్‌కు అంతరాయం ఉండొద్దనే ఉద్దేశంతో అదనపు బ్యాలెట్ కంట్రోల్ యూనిట్లను కేటాయిస్తున్నట్లు వివరించారు. రిజర్వ్‌లో ఉన్న బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లు ర్యాండమైజేషన్ ప్రక్రియ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశాల్లో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఈవో పాణిని, మైనార్టీ జిల్లా అధికారిణి ప్రేమలత, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, తహసీల్దార్ రవీందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

మల్లూరు ఆలయంలో వేలం పాటలు

మంగపేట, మే 2 : ఈనెల 19 నుంచి 28 వరకు మల్లూరు గుట్టపై బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో గుట్టపై వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు గురువారం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేలం పాటలు నిర్వహించారు. లడ్డూ, ప్రసాద విక్రయ హక్కును రూ.3.18 లక్షలకు మల్లూరుకు చెందిన గోవర్ధన్, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు రూ.55 వేలకు శ్రీకాంత్, పూల అలంకరణ హక్కు శ్రీనివాస్ రూ.37వేలు, తడకలతో పందిళ్ల ఏర్పాటు, రంగులు వేసే పనికి రూ.57 వేలకు సదానందం వేలంలో హక్కులు పొందారు. వేలంలో హక్కులు పొందిన వారు ఈ నెల 5 నుంచి జూన్ 4వరకు వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని ఈవో సత్యనారాయణ ప్రకటించారు. కాగా, కొబ్బరి కాయల విక్రయాలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కు, చెప్పుల స్టాండ్ నిర్వహణ, ఫొటో తీసుకునే హక్కుకు ఈనెల 5న వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ ముకుందం, అర్చకులు, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

మల్లూరు ఇన్‌చార్జి ఈవోగా మహేశ్

మల్లూరు ఆలయ ఈవో సత్యనారాయణ అనారోగ్య కారణంగా రెండు నెలల పాటు సెలవు పెట్టిన నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొడవటంచ లక్ష్మీనర్సింహస్వామి ఈవో మహేశ్‌కు ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

బిజినెస్ ఆఫర్

★రూ. 1 లక్ష నుండి 3 లక్షలు వరకు పెట్టుబడి పెట్టువారు సంప్రదించండి. మాది వెజ్, నాన్ వెజ్ పచ్చళ్ల వ్యాపారం. వరంగల్, హన్మకొండ, ఖాజీపేట, స్టేషన్ ఘన్‌పూర్‌లో షాప్స్ ఏర్పాటు కొరకు ఇన్వెస్టర్లు లేదా పార్ట్‌నర్స్ సంప్ర: నెలకు 15 నుండి 45 వేలు వరకు ఉంటుంది. సెల్: 8143909459.
NTW-000

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఉపాధి హామీ కూలీకి గాయాలు

గణపురం, మే 2 : ప్రమాదవశాత్తు మట్టి పెడ్డ పడి ఉపాధి హామీ కూలీ కాలు విరిగిన ఘటన గురువారం చోటుచేసుకుంది. తోటి కూలీల కథనం మేరకు ఉపాధి పనుల్లో భాగంగా మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువులో జరుగుతున్న పూడికతీత పనులకు మోటపోతుల రాజేశ్వరి హాజరైంది. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో మట్టి పోస్తుండగా మట్టి పెడ్డ జారి ఆమె కాలుపై పడడంతో విరిగిపోయింది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ దూలం శ్రీదేవి, తోటి కూలీలు వెంటనే స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. రాజేశ్వరికి న్యాయం జరిగేలా చూస్తామని ఎంపీడీవో భాస్కర్, ఇన్‌చార్జి ఏపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి విజేందర్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

'మోసాల కాంగ్రెస్‌ను ఓడించాలి'

కృష్ణకాలనీ, మే 2 : అబద్దాల హామీలిచ్చి గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని బీజేపీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోరుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ 30వ వార్డు రెడ్డికాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మహిళలకు నెలకు రూ . 2500 ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదన్నారు. రైతుబంధు వేయలేదని, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఎవరికిచ్చారో చెప్పాలన్నారు. ప్రచారంలో అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రాంరెడ్డి, నాయకులు సబ్బాని నారాయణ, బానోత్ రవినాయక్, గిట్ల రాజిరెడ్డి, భీమన్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం ప్రమాణాలను నమ్మరు

- వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్
- ఎమ్మెల్సీ సిరికొండ, మాజీ ఎమ్మెల్యే గండ్రతో కలిసి భూపాలపల్లిలో ప్రచారం

ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పక్కన అభ్యర్థి సుధీర్‌కుమార్, సిరికొండ

భూపాలపల్లి రూరల్, మే 2 : సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రమాణాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ, రాంనగర్‌లోఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మోస పూరిత, అమలు చేయలేని హామీలతో కాంగ్రెస్ గెలిచిందని, వంద రోజుల్లోనే వారి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ భూ కబ్జాదారుడని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే ఓటు వేసే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి నమ్మక ద్రోహులని, వారి మాటలు ఎవరూ నమ్మరన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. 420 హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు మంగళం పలికిందన్నారు. ఎమ్మెల్సీ సిరికొండ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో భూపాలపల్లి జిల్లాలో సమగ్రాభివృద్ధి జరిగిందన్నారు. ఉద్యమ నాయకుడు సుధీర్‌కుమార్‌కు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో జీఎస్టీ అమలు చేసి పేదలను దోచుకున్నదని, నిరుద్యోగాన్ని పెంచిందని, అదానికి ఆస్తులను పెంచుతున్నదని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ అలవిగాని హామీలతో ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు అక్రమాలు, అన్యాయాలకు పాల్పడుతున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో జిల్లాల ఏర్పాటు శాస్త్రీయంగా జరగలేదని, వాటిని 17కు కుదిస్తామని అంటున్నారని, ఒకవేళ అదే జరిగితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా లేకుండా పోతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే మరో ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ అండదండలతో సుభాష్‌కాలనీలో ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇప్పించానన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే సుధీర్‌కుమార్‌ను అక్కున చేర్చుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధర్, బీఆర్‌ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, నాయకులు బుర్ర రమేశ్ గౌడ్, మాడ హరీశ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డుల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న బాలల రక్షణ అధికారి ఓంకార్

వెంకటాపూర్, మే 2 : పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలని ములుగు జిల్లా బాలల రక్షణ అధికారి ఓంకార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక అధికారులైన పంచాయతీ కార్యదర్శులకు వివాహాల నమోదు చట్టం, బాల్య వివాహాల నిరోధ క చట్టంపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ హాజరై మాట్లాడారు. గ్రామ పరిధిలో సీఎంపీవోలుగా పంచాయతీ కార్యదర్శులు ఉంటారని, బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, 1098 నుంచి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 156 బాల్య వివాహాలు ఆపామని, పంచాయతీ కార్యదర్శుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఎంపీడీవో రాజు మాట్లాడుతూ బాలల సమస్యలు వచ్చినా తమ సహకారం ఉంటుందన్నారు. 100 రోజుల పనుల్లో కూడా బాలల లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సునీత, డీసీపీయూ అధికారి బండారి జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

దేవాదుల పంపింగ్ ప్రారంభం

కన్నాయిగూడెం, మే 2 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఒక మోటర్ ద్వారా గోదావరి నీటి పంపింగ్‌ను గురువారం ప్రారంభించారు. ఫేస్–2లోని ఒక మోటర్ ఆన్ చేసి 247 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌కు తరలిస్తున్నట్లు నీటిపారుదలశాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు. సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతూ 75.15 మీటర్లకు చేరింది. ఎగువనుంచి బరాజ్‌కు చుక్కనీరు రావడంలేదని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్ ఒక గేటును స్వల్పంగా పైకెత్తి 100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాసారథి బృందం సభ్యులు

ఓటు హక్కుపై కళాప్రదర్శన

తాడ్వాయి, మే 2 : ఓటు హక్కు వినియోగం, వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సాంస్కృతిక కళాసారథి బృందం గురువారం ప్రజలకు అవగాహన కల్పించింది. డీపీఆర్‌వో ఆధ్వర్యంలో గురువారం వెంగళాపురం, గోనెపల్లి గ్రామాల్లో వారు కళా ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో కళాసారథి బృందం సభ్యులు రాగుల శంకర్, గోల్కొండ బుచ్చన్న, ఈర్ల సాగర్, మార్త రవి, కనకం రాజేందర్, కిషన్, విజయ్‌కుమార్, తిరుపతి, కుమార్, నరేశ్, భాస్కర్, దీపక్, రాము, శ్రీలత, శోభ పాల్గొన్నారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా

వెంకటాపూర్, మే 2 : డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ మల్చూర్ నాయక్, డివిజనల్ ఇంజినీర్ పీ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం వెంకటాపూర్, నర్సాపూర్, వెల్తుర్లపల్లి సబ్‌స్టేషన్లలో జరుగుతున్న డబుల్ ఎర్తింగ్ పనులను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ లైన్‌లో కంట్రోల్ ఏ, బీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని వాటి వల్ల బ్రేక్‌డౌన్‌లు జరిగినప్పుడు సమస్యను త్వరగా గుర్తించడమే కాక, విద్యుత్‌ను పునరుద్ధరించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ ఎన్ వేణుగోపాల్, స్వామిరెడ్డి, ఏఈ సురేశ్, సబ్ ఇంజినీర్ రాజు, సీనియర్ లై ఇన్‌స్పెక్టర్ జీ ఉదయ్ భాస్కర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, లైన్‌మెన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మల్చూర్ నాయక్

చికిత్స పొందుతూ మహిళ మృతి

రేష్మ (ఫైల్)

మంగపేట, మే 2 : మండల కేంద్రంలోని పొదుమూరుకు చెందిన రేష్మ (30) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. రేష్మ భర్త యాకూబ్‌పాషా మార్చి 20న జబ్బోనిగూడెం సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన రేష్మ వారం క్రితం ఎలుకల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రెండు నెలల వ్యవధిలోపే తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. మృతురాలి అత్త తాహెరాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కేంద్ర ప్రభుత్వ అప్పు రూ. 100 లక్షల కోట్లు

భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, మే 2 : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రూ. 100 లక్షల కోట్ల అప్పు చేసిందని, నిరుద్యోగాన్ని పెంచిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, గొర్లవేడు, కొంపల్లి, ఎస్‌ఎం కొత్తపల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసినట్లు తెలిపారు. సమావేశాల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మార్క విజయ్, గ్రామాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మంగపేటలో దొంగనోటు కలకలం

మంగపేట, మే 2 : మండలకేంద్రంలోని ఓఎలక్ట్రానిక్ షాపులో గుర్తు తెలియని వ్యక్తి రూ.200 ఇచ్చి వస్తువు కొనుగోలు చేశాడు. డబ్బులు డిపాజిట్ చేసేందుకు గురువారం వ్యాపారి బ్యాంకుకు వెళ్లగా నగదు లెక్కించిన క్యాషియర్ రూ.200 నోటు నకిలీదని తేల్చాడు. ఈ విషయం మండలకేంద్రంలోని వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటో గ్రాఫర్ మృతి

సాంబయ్య (ఫైల్)

ఏటూరునాగారం, మే 2 : మండలంలోని జీడివాగు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బందెల సాంబయ్య (32) మృతి చెందాడు. ఏటూరునాగారం వైపు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఇసుక లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

వాహనాల తనిఖీ

వాజేడు, మే 2 : మండలంలోని చెరుకూరు శివారు జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్లు సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి గురువారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

కారును తనిఖీ చేస్తున్న ఎస్సై

ఎన్నికలకు సమాయత్తం

- భూపాలపల్లి నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాలు
- పీవో, ఏపీవోలకు మొదలైన శిక్షణ
- నేటి నుంచి ఓపీవోలకు..
- ఓటు ప్రాధాన్యత వివరిస్తూ నేడు 5కే రన్
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అబ్జర్వర్స్
- 206 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- 78 మందికి హోం ఓటింగ్

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా

జయశంకర్ భూపాలపల్లి, మే 2 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, బరిలో నిలిచే అభ్యర్థుల ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పోలింగ్ శాతం పెంచడంతో పాటు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడం, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టారు. ఇప్పటికే మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ పూర్తయింది. పీవో, ఏపీవోలకు గురువారం మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ప్రారంభం కాగా నేటి (శుక్రవారం) నుంచి ఓపీవోలకు శిక్షణ ప్రారంభం కానుంది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ పరిధిలో అధికారులు నేడు 5కే రన్ నిర్వహించనున్నారు. రన్‌కు కలెక్టర్ భవేశ్‌మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. పోలింగ్ కేంద్రాలు, చెక్‌పోస్టులను కలెక్టర్‌తో పాటు ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 317 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా ఇందులో 61 సమస్యాత్మకంగా గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టారు. 206 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తూ మిగిలిన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకురాలు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంను ప్రత్యేకంగా పరిశీలించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు నీరజ్ సింగా చెక్‌పోస్టులను తనిఖీ చేసి నిఘాను పటిష్టం చేశారు. ఇప్పటి వరకు రూ. 31,64,280 నగదును సీజ్ చేశారు.

2,76,752 మంది ఓటర్లు

భూపాలపల్లి నియోజకవర్గంలో 2,76,752 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 1,36,507 మంది పురుషులు, 1,40,238 మంది మహిళలు, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లున్నారు. 18–19 ఏళ్ల వయస్సు గల ఓటర్లు 7,898 మంది, 80 ఏళ్లు పైబడిన వారు 4,733, దివ్యాంగులు 4,923 మంది ఉన్నారు. 85 మంది ఇంటి వద్ద ఓటు హక్కును వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకోగా ఐదుగురి దరఖాస్తులు తిరస్కరించారు. నియోజకవర్గంలో 317 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మూడు రూట్లుగా విభజించి మూడు టీంలను ఏర్పాటు చేశారు. మూడు ఎస్ఎస్‌టీ , మూడు ఎఫ్ఎస్‌టీ , రెండు వీఎస్‌టీ టీంలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

పీవోలు, ఏపీవోల విధులు కీలకం

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, మే 2 : ఓటర్లు నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవడంలో పీవోలు, ఏపీవోల విధులు కీలకమని భూపాలపల్లి ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం మాక్ పోలింగ్ ముగిసిన తరువాత వీవీ ప్యాట్‌లో స్లిప్పులను సరిపోల్చి చూడాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని అందజేయాలని సూచించారు. శుక్రవారం నిర్వహించే శిక్షణకు ఓపీవోలు ఉదయం 10 గంటల వరకే చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది మేనేజ్‌మెంట్ అధికారులు సామ్యూల్, అవినాష్, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

హోం ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

ములుగురూరల్, మే 2 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 12డి ఫామ్ ద్వారా నిర్వహించే హోం ఓటింగ్‌ను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో, ఎన్నికల సహాయ అధికారి చిత్రామిశ్రా అన్నారు. హోమ్ ఓటింగ్‌పై కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 77మంది ఓటర్లు హోమ్ ఓటింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకోసం 14 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. హోం ఓటింగ్‌తో పాటు పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ శ్రీపాల్ పాల్గొన్నారు.

6 వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు

భూపాలపల్లి రూరల్, మే 2 : జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఈ నెల 6లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ఎన్ రాంకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫీజు అందజేయాలని సూచించారు. విద్యార్థులు రీ వెరిఫికేషన్ కోసం రూ.1000, రీ కౌంటింగ్‌కు రూ. 500 చలానా కట్టి మెమో, హాల్‌టికెట్ జతచేసి హెచ్‌ఎం సంతకంతో ఈ నెల 15లోగా సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని డీఈవో సూచించారు.

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సునీల్ కుమార్

'రేవంత్ మాటలు నమ్మొద్దు'

ఏటూరునాగారం, మే 2 : తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణం చేస్తున్నారని, బూటకపు ఒట్లను నమ్మొద్దని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని దొడ్ల, కొత్తూరు గ్రామాల్లో గురువారం ఆయన మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి కవిత తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కి ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పాలన్నారు. ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. ప్రచారంలో నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, సిద్దబోయిన రాంబాబు, కాళ్ల రామకృష్ణ, కమలేశ్, భూక్యా సురేశ్, మండపల్లి శ్రీనివాస్, కోగిల రాంబాబు, అఖిల్, రాకేశ్, మాదిరి రాంబాబు పాల్గొన్నారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి

మహదేవపూర్, మే 2 : నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీవో ప్రసాద్ జీపీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని అంబట్‌పల్లిలో జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

గణపురం, మే 2 : మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు తాళ్లపల్లి రామకృష్ణ గౌడ్ అనారోగ్యంతో కొన్ని నెలల క్రితం మృతి చెందగా గురువారం తోటి స్నేహితులు ఆయన కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు పుప్పాల దీపక్‌పటేల్, శశిధర్, ఇమ్మడి సునీల్, లింగంపల్లి చందర్‌రావు, అనుముల మల్లయ్య, సంధ్య, లావణ్య, విడిదినేని శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

మహదేవపూర్ (కాటారం), మే 2 : పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని సీపీఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బందు సాయిలు పిలుపునిచ్చారు. కాటారం మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజాధనాన్ని కార్పొరేట్లకు దోచిపెట్టిందే తప్ప ప్రజలకు ఏం చేయలేదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పోలం రాజేందర్, కాటారం మండల కార్యదర్శి ఆత్మకూరి శ్రీకాంత్, నాయకులు పోలం చిన్న రాజేందర్, జాడి మల్లేశ్వరి, తరుణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మంగపేట, మే 2 : మండలంలోని తిమ్మంపేట, రాజుపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఏడీఏ విజయ్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సకాలంలో గన్నీ బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఏడీఏ వెంట ఏవో చేరాలు, ఏఈవో ఉన్నారు.